

వైభవంగా ఆదిత్యుని తెప్పోత్సవం

ప్రజాశక్తి - శ్రీకాకుళం



కార్తీక శుద్ధ ఏకాదశి, క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి హంస నావికోత్సవం(తెప్పోత్సవం) శనివారం వైభవంగా సాగింది. ఆలయానికి అభిముఖంగా ఉన్న ఇంద్ర పుష్కరిణిలో ప్రత్యేకంగా తయారు చేసిన హంస వాహనంపై ఉషా, ఛాయ, పద్మినీ సమేతుడైన సూర్యనారాయణ స్వామిని ఊరేగించారు. పెద్ద సంఖ్యలో హాజరైన యాత్రికుల మధ్య తెప్పోత్సవం కనులపండువలా కొనసాగింది. కార్తీక శుద్ధ ద్వాదశి సందర్భంగా అరసవల్లి ఆదిత్యుని ఆలయం కిటకిటలాడింది. కార్యక్రమంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, ఆర్‌డిఒ బి.శాంతి, ఆలయ కార్యనిర్వహణాధికారి వి.హరి సూర్యప్రకాష్, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలే... పనుల్లేవు

బ్యారేజీ దృఢంగా ఉంటే కాలువలకు ఎంత పరిమాణంలో నీటినైనా విడిచిపెట్టవచ్చు. కాలువలను పటిష్టంగా తయారు చేస్తే సామర్థ్యం మేరకు కాలువులకు సాగునీరు వదలవచ్చు. అంతేకాదు శివారు భూముల వరకు సాగునీరు చేరి భూములు తడుస్తాయి. హిరమండలం మండలం గొట్టాబ్యారేజీ విషయంలో ప్రభుత్వం ఎందుకనో ఈ అంశాలను విస్మరిస్తోంది. బ్యారేజీ లైనింగ్, ఎడమ కాలువ ఆధునీకరణ పనులకు అధికారులు పంపిన ఫైళ్లకు క్లియరెన్స్ ఇవ్వకుండా నాన్చుతోంది. బ్యారేజీ పటిష్ట చర్యలను పక్కనపెట్టిన ప్రభుత్వం, ఆ బ్యారేజీ నుంచి నీళ్లను తోడి హిరమండలం రిజర్వాయర్‌ను నింపే పనులకు తొందరపడుతున్న ప్రభుత్వ తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



జలుమూరులో బలహీనంగా ఉన్న వంశధార ఎడమ ప్రధాన కాలువ గట్టు

- రూ.834 కోట్లతో వంశధార ఎల్‌ఎంసి ఆధునీకరణకు ప్రతిపాదనలు
- ఆర్‌ఎంసి లైనింగ్ పనులకు రూ.18.35 కోట్లు
- ఏడాది గడిచినా క్లియరెన్స్ ఇవ్వని ప్రభుత్వం
- మరోసారి కొత్త రేట్లతో అంచనాలను రూపొందిస్తున్న ప్రభుత్వం

హిరమండలం మండలం గొట్టాబ్యారేజీ నుంచి నీటిని విడిచిపెడుతున్న ఎడమ వైపు కాలువ పరిస్థితి దయనీయంగా ఉంది. కాలువ నుంచి 12 మండలాల పరిధిలోని 1,48,000 ఎకరాలకు సాగునీరందించేలా కాలువను నిర్మించారు. కాలువ నుంచి 2,480 క్యూసెక్కుల నీరు విడిచిపెట్టేలా కాలువను డిజైన్ చేశారు. బ్యారేజీలో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్న రోజుల్లోనూ 1800 క్యూసెక్కులకు మించి విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. కాలువలు నిర్వహణ లేకపోవడం, గట్లు బలహీనంగా ఉండడంలో అంతకుమించి నీటిని వదిలితే గండి కొట్టే ప్రమాదమూ లేకపోలేదు. కాలువ వాస్తవ సామర్థ్యం మేరకు నీటిని విడిచిపెట్టలేకపోవడంతో ప్రతి సంవత్సరం పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని వేలాది ఎకరాల భూములు ఎండిపోతున్నాయి. తుపాన్లు, నీటి ప్రవాహ ఉధృతికి క్రమేణా కాలువ గట్టు కోతకు గురవుతున్నాయి. 40 ఏళ్ల కిందట రాతితో నిర్మించిన నిర్మాణాలు ప్రస్తుతం దెబ్బతినడంతో ఎడమ కాలువ సామర్థ్యం అంతకంతకూ తగ్గిపోతోంది. క్షేత్రస్థాయి పరిస్థితులను గుర్తించిన ఇంజినీరింగ్ అధికారులు ఎడమ కాలువను ఆధునీకరించాల్సిన అవసరాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ఆధునీకరణ పనులకు రూ.834 కోట్ల అవసరమని 2021-22 కొత్త ఎస్ఎస్ఆర్ (షెడ్యూల్ స్టాండర్డ్ రేట్స్)తో నివేదికను గతేడాది పంపారు. ఏడాది గడిచినా ఇప్పటివరకు ప్రభుత్వం ఆమోదం తెలపలేదు. దీంతో అంచనా వ్యయం పెరగడంతో మరోసారి అధికారులు 2022-23 సంవత్సరపు ఎస్ఎస్ఆర్ రేట్లతో అంచనాలను రూపొందిస్తున్నారు.

కుడి ప్రధాన కాలువదీ అదే దుస్థితి

గొట్టాబ్యారేజీ కుడి ప్రధాన కాలువదీ అదే దుస్థితి. కాలువ గట్లు కోతకు గురయ్యే ప్రాంతంలో సిసి లైనింగ్ పనుల కోసం 2021-22లో రూ.18.45 కోట్లతో అంచనాలు రూపొందించి పరిపాలనా ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపారు. ఏడాది గడిచినా ప్రభుత్వం నుంచి క్లియరెన్స్ రాకపోవడంతో 2022-23 రేట్లతో కొత్త ఎస్ఎస్ఆర్‌తో అంచనాలను తయారు చేస్తున్నారు.

రెండు పర్యాయాలు కోతకు గురైన గట్టు

వంశధార కాలువలు, గొట్టాబ్యారేజీ ప్రాంతం ఎంత బలహీనమో ఈ సంవత్సరం రెండు సందర్భాల్లో చోటుచేసుకున్న ఘటనలే అందుకు ఉదాహరణ. గత నెలలో వంశధారలో 80 వేల క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తున్న సందర్భంలో బ్యారేజీ దిగువ కుడివైపు గట్టు కోతకు గురైంది. గట్టును రూ.13.5 లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. అదేవిధంగా హిరమండలం అక్కరాపల్లి ఈ ఏడాది జులైలో అండర్ టన్నల్ వద్ద కాలువకు గండి పడింది. దాన్నీ రూ.ఐదు లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టి కాలువలకు నీరు విడిచిపెడుతున్నారు. వంశధార ఉధృతంగా ప్రవహిస్తే కాలువలు, గొట్టాబ్యారేజీ గట్లు ఎప్పుడు ఏవి కొట్టుకుపోతాయో అన్న పరిస్థితి నెలకొంది.

ఆధునీకరణ పనులకు మోక్షమెప్పుడో?

గొట్టాబ్యారేజీ పటిష్టత, వంశధార కాలువ ఆధునీకరణ పనులను పక్కన పెట్టేసిన ప్రభుత్వం ఎత్తిపోతల పథకం నిర్మాణానికి సిద్ధమవుతోంది. గొట్టాబ్యారేజీ కుడి ప్రధాన కాలువపై ఎత్తిపోతల ద్వారా 12 టిఎంసిల నీటిని హిరమండలం రిజర్వాయరు నింపేందుకు అంచనాలను రూపొందించింది. ప్రభుత్వం ఇప్పటికే రూ.185 కోట్లతో పాలనా అనుమతులను మంజూరు చేసింది. గొట్టాబ్యారేజీని నింపే ప్రయత్నాలు మంచివే. బలహీనంగా ఉన్న బ్యారేజీ, కాలువ గట్లను తక్షణం పటిష్టం చేయడం, ఆధునీకరణ పనులకు నిధులు మంజూరు చేయాల్సిన ఆవశ్యకత ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



ట్రిపుల్ ఐటిలో మెస్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

విద్యార్థుల అస్వస్థతపై సమగ్ర విచారణ

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశం

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

ట్రిపుల్ ఐటిలో 300 మంది పైబడి విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సమగ్ర విచారణకు ఆదేశించారు. ట్రిపుల్ ఐటిని శనివారం పరిశీలించిన ఆయన అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించారు. వాటర్‌ప్లాంట్‌ను, మెస్‌ను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా హాస్టల్ నిర్వహణపై విద్యార్థుల నుంచి సమాచారం సేకరించారు. శుక్రవారం రాత్రి అల్పాహారంగా చపాతి తిన్న తర్వాత కడుపునొప్పి, వాంతులు ప్రారంభమయ్యాయని కొందరు విద్యార్థులు కలెక్టర్‌కు వివరించారు. మరికొందరు శుక్రవారం ఉదయం అల్పాహారంలో పూరీ తిన్న తర్వాత కడుపునొప్పి అంటూ వాంతులు చేసుకున్నారని చెప్పారు. సమస్య తీవ్రతను గుర్తించకుండా విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయాన్ని గోప్యంగా ఉంచడంపై ట్రిపుల్ ఐటి డైరెక్టర్ పి.జగదీశ్వరరావుపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు కడుపునొప్పి, వాంతులతో ఇబ్బందులు పడుతున్నా ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకపోవడంపై డైరెక్టర్‌ను ప్రశ్నించారు. విద్యార్థుల అస్వస్థతకు ఫుడ్ పాయిజనింగ్, కలుషిత నీరు కారణమా? విచారణ చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. నిర్లక్ష్యం ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ట్రిపుల్ ఐటిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించిన కలెక్టర్ 24 గంటలూ వైద్య సేవలు అందించడానికి వైద్యులను ఏర్పాటు చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి మీనాక్షిని ఆదేశించారు. తీవ్ర అస్వస్థతకు గురై రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఇద్దరు విద్యార్థుల యోగక్షేమాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్యాంపస్‌లో ప్రాథమిక వైద్య సేవలు కొనసాగించాలని డైరెక్టర్‌ను ఆదేశించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదని, మందుల ద్వారా సాధారణ స్థితికి చేరుకుంటారని వైద్యులు చెప్పారని కలెక్టర్ తెలిపారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎస్ఎఫ్ఐ నాయకుల పరామర్శ

అస్వస్థత విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ నాయకులు క్యాంపస్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. ఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను కలిసి విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని వినతిపత్రం అందించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బి.హరీష్, జిల్లా ఉపాధ్యక్షులు బి.చందు తదితరులున్నారు.

తక్షణ నివేదిక అందించండి

విద్యార్థుల అస్వస్థతపై తక్షణమే నివేదిక సమర్పించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అధికారులను ఆదేశించారు. అత్యవసరమైతే ప్రభుత్వ, ఇతర ఆస్పత్రుల్లో చేర్పించి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఘటనకు గల కారణాలపై అన్ని కోణాల్లో పరిశీలించాలని, భవిష్యత్‌లో ఇటువంటివి పునరావృతం కాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

స్టోన్ ప్లాంటేషన్ వేగవంతం

అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో చేపడుతున్న స్టోన్ ప్లాంటేషన్ కార్యక్రమం మరింత వేగవంతం కావాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఛాంబర్ నుంచి స్టోన్ ప్లాంటేషన్ కార్యక్రమం అమలుపై సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ శనివారం నిర్వహించారు. ఇప్పటివరకు చేపట్టిన స్టోన్ ప్లాంటేషన్ పనుల నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 30 మండలాలకు సంబంధించి 171 గ్రామాలకు సరిహద్దు రాళ్లు పూర్తిస్థాయిలో అందజేయడమైందన్నారు. నేటికి నాలుగు గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ శతశాతం పూర్తి కావడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. పనులు చేపట్టిన గ్రామాల్లో మరింత వేగవంతం చేయాలని, ప్రారంభం కాని గ్రామాల్లో రేపట్నుంచి పనులు ప్రారంభించి బుధవారం నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో పురోగతి లేని గ్రామాల సిబ్బందితో సమావేశం నిర్వహించి, జాప్యానికి గల కారణాలపై వివరణ కోరుతున్నట్లు తెలిపారు. వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. స్టోన్ ప్లాంటేషన్ కార్యక్రమానికి సంబంధిత గ్రామస్థాయి సిబ్బందిని వినియోగించుకోవాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జిల్లా సర్వే, భూ రికార్డుల శాఖ సహాయ సంచాలకులు కె.ప్రభాకరరావు, డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు, తహశీల్దార్లు, సర్వేయర్లు, విఆర్‌ఒలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

హెల్త్ అలవెన్స్‌ను రికవరీ చేస్తే మరో పోరాటం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు



శ్రీకాకుళం కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పారిశుద్ధ్య కార్మికులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం/ ఆమదాలవలస

మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ఇస్తున్న హెల్త్ అలవెన్సును రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలనుకోవడం దుర్మార్గపు చర్య అని, దీనిపై మరో పోరాటం తప్పదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, హెచ్చరించారు. నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నగర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.గణేష్, ఎన్.బలరాం ఆధ్వర్యంలో, ఆమదాలవలస మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకుడు తాడి సంతోష్ ఆధ్వర్యాన శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తేజేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు పోరాడి సాధించుకున్న ఆక్యుపేషనల్ హెల్త్ అలవెన్సును కార్మికుల జీతాల నుంచి రికవరీ చేయాలని ఆదేశాలు జారీ చేశారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు రిస్క్, హెల్త్ అలవెన్స్, సంక్షేమ పథకాలు, తదితర సమస్యలపైన జిల్లా వ్యాప్తంగా ఈ నెల 11 నుంచి నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని, 20 నుంచి 25వ తేదీ వరకు సమ్మె చేయడానికి ఇంజినీరింగ్ కార్మికులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. తాడి సంతోష్ మాట్లాడుతూ హెల్త్ అలవెన్స్‌ను జనవరి నుండి అక్టోబర్ వరకు రికవరీ చేయాలని ప్రభుత్వం ఖజానా కార్యాలయాలకు నోటీసులు ఇవ్వడం దారుణమని అన్నారు. ఉప ఖజానా అధికారులు మున్సిపల్ కమిషనర్‌కు నోటీసులు పంపించారని, ఇదెక్కడి న్యాయమని ప్రభుత్వ తీరును ప్రశ్నించారు. అనంతరం ఆమదాలవలస మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ శ్రీకాకుళం నగర నాయకులు కళ్యాణరాజు, ఎన్.పార్థసారథి, డి.యుగంధర్, ఎ.రాము, ఎ.శంకర్, బి.సరోజ, ఆర్.ఈశ్వరమ్మ, సీతమ్మ, ఎ.లక్ష్మి, డి.గంగ, ఆమదాలవలస మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఎన్.రాజేష్, జె.వాసు, ఈశ్వరరావు, రాజేశ్వరి, ఎన్.రాము, తదితరులు పాల్గొన్నారు.



ఆమదాలవలస: నిరసన తెలుపుతున్న పారిశుద్ధ్య కార్మికులు

సొసైటీల బలోపేతమే లక్ష్యం

ఆప్కాబ్ చైర్‌పర్సన్ ఝాన్సీరాణి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రాష్ట్రంలోని సహకార బ్యాంకులు, పరపతి సంఘాలను బలోపేతం చేయడమే తమ లక్ష్యమని రాష్ట్ర సహకార బ్యాంకు లిమిటెడ్ (ఆప్కాబ్) చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి స్పష్టం చేశారు. నగరంలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సమావేశ మందిరంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావుతో కలిసి శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా డిసిసిబిలు లాభాల బాటలో నడుస్తున్నాయని తెలిపారు. డిసిసిబి రూ.1900 కోట్ల టర్నోవర్‌తో రూ.పది కోట్ల లాభాలతో నడవడం గర్వకారణమన్నారు. ఇతర వాణిజ్య బ్యాంకులకు ధీటుగా డిసిసిబిలు పనిచేస్తున్నాయని, దీన్ని మరింత బలోపేతం చేయడమే తమ ముందున్న లక్ష్యమని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా సొసైటీల ద్వారా మూడు విడతల్లో గోదాముల నిర్మాణాలు జరుగుతున్నాయని, తద్వారా సొసైటీలు మరింత బలోపేతం కాగలవని ఆశాభావం వ్యక్తం చేశారు. 40 శాతం రాయితీతో వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లను మంజూరు చేయడం, అతి తక్కువ వడ్డీకే రుణాలను డిసిసిబిల ద్వారా మంజూరు చేయనున్నట్లు తెలిపారు. డిసిసిబిలను లాభాల బాటలో నడిపిస్తున్న ఉద్యోగుల భద్రతనూ చూడాల్సిన ఆవశ్యకత తమపై ఉందన్నారు. డిసిసిబిలను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రెండు వేల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు త్వరలో అనుసంధానం చేస్తూ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు తొలిసారిగా ఆన్‌లైన్ సేవలకు రూపకల్పన చేసిందని, తద్వారా ఖాతాదారులు ఇంటి వద్ద నుంచే తమ కార్యకలాపాలను నిర్వహించుకోవచ్చని సూచించారు. జిల్లాలో 25 బ్రాంచ్‌లతో రూ.1900 కోట్ల టర్నోవర్‌తో డిసిసిబి నడుస్తుందని డిసిసిబి చైర్మన్ రాజేశ్వరరావు తెలిపారు. రూ.400 కోట్ల మేర డిపాజిట్లను సేకరించడమే కాకుండా ఇతర బ్యాంకులకు ధీటుగా అధిక శాతం వడ్డీని ఇస్తున్న ఏకైక బ్యాంకు డిసిసిబి అని కొనియాడారు. సీనియర్ సిటిజన్లకు 7.1 శాతం, మిగిలిన వారికి 6.6 శాతం మేర డిపాజిట్లపై వడ్డీని చెల్లిస్తున్నామని చెప్పారు. అత్యధిక రుణాల మంజూరు చేయడంలో కూడా తమ బ్యాంకు ముందంజలో ఉందన్నారు. కేవలం రూ.0.58 పైసల వడ్డీకే బంగారు ఆభరణాలపై రూ.250 కోట్ల మేర రుణాలను మంజూరు చేశామన్నారు. జిల్లాలో 49 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉన్నాయని, 1.82 లక్షల మంది రైతులను డిసిసిబికి అనుసంధానం చేసి పనిచేస్తున్నట్లు తెలిపారు. 40 శాతం రాయితీతో వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లను మంజూరు చేస్తున్నామన్నారు. అనంతరం డిసిసిబి రూపొందించిన మొబైల్ యాప్‌ను ఝాన్సీరాణి ఆవిష్కరించారు. సమావేశంలో డిసిసిబి సిఇఒ డి.వరప్రసాద్, శిమ్మ జగదీష్, ఎస్.వి సత్యనారాయణ, రమేష్, జ్యోతిర్మయి, సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఝాన్సీరాణి

కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస



నాడు-నేడు పనులకు శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ తమ్మినేని

కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని వంజంగిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.1.25 కోట్లతో చేపట్టిన నాడు-నేడు పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు ఆధునీకరణ, సుందరీకరణ ద్వారా పూర్తిస్థాయి మౌలిక వసతులు సమకూర్చుకుంటూ ఆహ్లాదకర వాతావరణాన్ని రూపుదిద్దుకుంటున్నాయని చెప్పారు. బైజూస్ వంటి అంతర్జాతీయ సంస్థతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన, అధునాతన విద్యను అందించే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుందన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే సాంప్రదాయ విద్యాభ్యాసనతో పాటు అధునాతన పాఠ్యాంశాలు అభ్యసన సాధ్యపడుతుందన్నారు. విషయ అంశాలతో పాటు ప్రయోగిక పరిజ్ఞానం అలవరుచుకునే వీలుంటుందని చెప్పారు. కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలను తలదన్నేలా కనీస వసతుల కల్పనతో అత్యున్నత స్థాయి బోధనతో ఉన్నత స్థాయి విద్యాసంస్థలుగా తీర్చిదిద్దడమే సీఎం అభిమతమన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలను విద్యా వనరుల కేంద్రాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామాభివృద్ధిని అడ్డుకునేలా గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు వ్యవహరించడం తగదని స్పీకర్ అన్నారు. గ్రామంలో కనీస మౌలిక వసతుల సదుపాయాల కల్పనకు తాను కట్టుబడి ఉంటే, పనులు చేపట్టకుండా ఉండేలా కోర్టులకు వెళ్లి అడ్డు తగలడం సరికాదన్నారు. దీనివల్ల గ్రామానికి రావాల్సిన నిధులు, అభివృద్ధి కార్యక్రమాలు దూరమయ్యే పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు జి.శ్రీనివాసరావు, డిసిఎంఎస్ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, సర్పంచ్ బెండి సత్యవతి, ఎంపిటిసి తాండ్ర లక్ష్మి, ఎంపిడిఒ ఎం.రేణుక తదితరులు పాల్గొన్నారు.

వృథా వివాదాలు... దగా విధానాలు

వీక్షణం

రాష్ట్ర రాజకీయాలు వేడెక్కడంతో ఆగలేదు. కొలిమిలో కాలుతున్న చందంగా మారాయి. వృథా వివాదాలు, దగా విధానాలు రాజ్యమేలుతున్నాయి. కేవలం సంక్షేమ పథకాలే తమకు మళ్లీ అధికార కాంక్ష ఆకలిని తీర్చనుందని, 175 సీట్లు తమవేనని అధికార పార్టీ అధినేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిత్యమూ తన ప్రసంగాల ద్వారా వెల్లడిస్తూనే ఉన్నారు. వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటున్నాయని ఆ పార్టీ నేతలే చెప్తున్నారు. వృథా వివాదాలకు కేంద్రంగా మార్చి, ప్రజల సమస్యలను గాలికి వదిలేసే పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల లేమితో పాటు కనీసం సమీక్షలు చేసి నిర్ణయాలు తీసుకునే పరిస్థితి కనిపించడం లేదు. అధికార పార్టీకి మూడు రాజధానుల నినాదం, నిరసనలు తప్ప మరేమీ కనిపించడం లేదు. అందుకు ఇటీవల జరిగిన జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశం ప్రత్యక్ష తార్కాణం. విశాఖ రాజధాని అంశంపై సుదీర్ఘ చర్చకు సమయం ఉంది గానీ ప్రజా సమస్యలపై ఎలాంటి అవకాశం ఇవ్వకపోవడం ప్రజా ద్రోహం కాదా? అని ప్రజాస్వామ్యవాదులు ప్రశ్నిస్తున్నారు. సమయం చాలదంటే మరో రోజు సమావేశాన్ని పొడిగించుకుని సమీక్షించాల్సింది. గతంలో రెండు రోజులు సమావేశాలు నిర్వహించిన చరిత్ర కూడా ఉంది. ముఖ్యమంత్రి వద్ద మెప్పు పొందడానికి ఏర్పాటు చేసిన సమావేశంగా ఉంది తప్ప, ప్రజా సమస్యల పరిష్కారంపై నేతలకు చిత్తశుద్ధి లేదన్నది జరిగిన, జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. సమావేశానికి వచ్చిన ప్రజాప్రతినిధులు కొందరు గత సమావేశంలో తాము లేవనెత్తిన సమస్యలకు పరిష్కారం చూపలేదని, తిరిగి ప్రస్తావనకే అవకాశం లేకుండా చేశారని అసంతృప్తితో వెళ్లిపోయినట్లు తెలిసింది. అదే భావనలో కొందరు ఎమ్మెల్యేలూ ఉన్నారు. గర్జనలపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై గర్జించడానికి నేతలెవరూ సాహసించలేని పరిస్థితిని చూస్తున్నాం. ప్రభుత్వ తీరు చూస్తుంటే పాలనలో బండి ముందు గుర్రం వెనుక అన్న చందంగా తయారైంది. భావనపాడు పోర్టు ఏర్పాటులో ప్రభుత్వం పునరావాసం, పరిహారం, ప్యాకేజీని ఏకబిగిన ప్రకటించకుండా చట్టాలను తుంగలో తొక్కే పరిస్థితి కనిపిస్తోంది. నేటివరకు పునరావాసం కల్పన మాటలే తప్ప చేతల్లో ఒక్క అడుగూ వేయని పరిస్థితిని చూస్తున్నాం. జిరాయతీ భూముల పరిహారం ధర నిర్ణయంలో రైతులు రెండు రోజుల్లో ఏ విషయం చెప్పాలని విష్ణుచక్రం, మూలపేట బాధిత రైతులను కలెక్టర్ కోరారు. పునరావాసం ఎక్కడ కల్పిస్తారు?, నిర్వాసితులకు ఎలాంటి పరిహారం, ప్యాకేజీ అందిస్తారన్న రైతుల ప్రశ్నలకు మాత్రం ఆయన సూటిగా సమాధానం ఇవ్వలేదు. భూములకు పరిహారం చెల్లించిన వెంటనే పోర్టు పనులకు ముఖ్యమంత్రి త్వరలో శంకుస్థాపన చేస్తారని ఆ సమావేశంలో పాల్గొన్న మంత్రి సీదిరి అప్పలరాజు చెప్పారు గానీ పునరావాసం కల్పనపై ఆయనా నోరు విప్పలేదు. పోర్టు నిర్మాణ విషయంలో రైతులను, బాధితులను దగా చేసే విధానాలనే ప్రభుత్వం అనుసరిస్తోందని స్పష్టమవుతోంది. అందువల్లే పునరావాసం, పరిహారం గురించి మొత్తం ప్యాకేజీని ఒకేసారి ప్రకటించకుండా జాగ్రత్తపడుతోంది. నిర్వాసితులకు సకాలంలో గూడు, నీడ లేకుండా చేసే పరిస్థితి వస్తుంది. జిల్లాలో వంశధార నిర్వాసితుల గోడు ఈనాటికీ సంపూర్ణంగా తీర్చే పరిస్థితి లేదన్నది అనుభవం. 2013 భూసేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులు కోరుకున్న చోటనే ఇళ్లు నిర్మించి ఇవ్వాలి. భూముల పరిహారం కింద చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రభుత్వం, పునరావాసం గురించి రైతులు ప్రశ్నిస్తున్నా చెప్పకపోవడం విడ్డూరంగా ఉంది. భూముల పరిహారం కూడా రిజిస్ట్రార్ విలువ కాకుండా బహిరంగ మార్కెట్ రేటు కంటే ఐదు రెట్లు ఎక్కువ చెల్లించాలి. ప్రభుత్వం మాత్రం ఎకరాకు రూ.25 లక్షలు చెల్లించేందుకు సిద్ధమైంది. రూ.30 లక్షలు కోరిన రైతులు చివరకు రూ.25 లక్షలకు అంగీకరించాల్సి వచ్చింది. ఇందులో ప్రభుత్వ పెద్దల ఒత్తిడి ఉందని తెలిసింది. పోర్టు నిర్మాణ ప్రతిపాదనలకు ముందు ఆ ప్రాంతంలో ఎకరా రూ.16 లక్షలు ఉండేది. పోర్టు ప్రతిపాదన వచ్చిన తర్వాత ఈ ఏడాది మొదట్లో రూ.25 లక్షలు ధర పలికింది. ఇప్పుడు మరింత పెరిగింది. అందుకని కనీసం రూ.30 లక్షలకు కోరారని తెలిసింది. పునరావాసానికి సంబంధించి భూ పరిశీలన ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని తెలిసింది. అందువల్లే బండి ముందు గుర్రం వెనుక చందంగా పాలన ఉందని చెప్పక తప్పదు. వృథా వివాదాలు, దగా విధానాల పాలన ప్రభావం జిల్లాలో ప్రత్యేకంగా కనిపిస్తోంది. పలాస మండలం బొడ్డపాడు రెవెన్యూ పరిధిలో రైతుల భూములకు పరిహారం చెల్లించకుండానే జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టడాన్ని ప్రశ్నించిన రైతులపై దాడి చేయడం తాజా ఉదాహరణ. ఇలాంటి చర్యలు దగా ప్రభుత్వంగా ముద్ర వేసుకోవడమే అవుతుంది.

- సత్తారు భాస్కరరావు



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి మంత్రి సత్యనారాయణ

12న విశాఖలో ప్రధాని పర్యటన

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి- ఆమదాలవలస, రణస్థలం

ఈ నెల 12న విశాఖలో అభివృద్ధి పనుల శంకుస్థాపనకు ప్రధాని మోడీ వస్తున్నారని, ఆ సభను భారీగా నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ కోరారు. శనివారం ఆమదాలవలస ఎస్‌ఎస్‌ఎన్ కళ్యాణ మండపం, ఎచ్చెర్ల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అధ్యక్షతన వైసిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని రాష్ట్రానికి వస్తున్న నేపథ్యంలో భారీ సభను ఏర్పాటు చేయాలనుకున్నట్లు సిఎం జగన్ ఆలోచన అన్నారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. స్పీకర్ తమ్మినేని సీతారాం మాట్లాడుతూ విశాఖపట్నం రైల్వే జోన్, విశాఖపట్నం-రాయపూర్ కారిడార్, తదితర శంకుస్థాపన కార్యక్రమాల్లో పిఎం పాల్గొంటారని తెలిపారు. ప్రధాని రాష్ట్రానికి అన్ని విధాలుగా సహకరిస్తున్నారని, సిఎంకు దీవెనలు అందిస్తున్న తరుణంలో ఈ సభను జయప్రదం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సమావేశంలో వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, కళింగ కార్పొరేషన్ అధ్యక్షులు మామిడి శ్రీకాంత్ జెడ్‌పిటిసి, ఎంపిపిలు పాల్గొన్నారు.



చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న సిఐటియు నాయకులు

చిన్నమ్మడు ఆశయసాధనకు కృషి

ప్రజాశక్తి- పోలాకి

సిఐటియు మండల కన్వీనర్ నేతింటి చిన్నమ్మడు ఆశయ సాధనకు కృషి చేద్దామని జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి అన్నారు. మండలంలోని ముప్పిడిలో సిఐటియు జిల్లా కార్యదర్శి వై.చలపతిరావు అధ్యక్షతన శనివారం సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూ కార్మిక వర్గం కోసం అలుపెరగని పోరాటాలు నిర్వహించారని గుర్తు చేసుకున్నారు. తిత్లీ తుపాను సమయంలో ప్రజల బాధలను అర్థం చేసుకుని వారికి ఆర్థికసాయం కోసం విరాళాలు సేకరించి అందజేశారని అన్నారు. పోలాకి రైస్ మిల్లు యాజమాన్యం కార్మికుల వేతనాలు సక్రమంగా ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్న సందర్భంలో కార్మికుల కోసం పోరాటాలు నిర్వహించారన్నారు. స్కీం వర్కర్ల సమస్యలపైన దేశవ్యాప్తంగా నిర్వహించిన జాతీయ సమ్మెలో పోలాకి, నరసన్నపేట మండలాల్లో పాల్గొని ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టారని అన్నారు. ప్రత్యేక హోదా, రైల్వే జోన్, విభజన హామీలు అమలుపై చేసిన పోరాటాల్లో భాగస్వామ్యమయ్యారని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.సురేష్‌బాబు, ఐద్వా నాయకులు స్వప్న, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జె.గన్నయ్య, ఎపి రైతు సంఘం నాయకులు తలసముద్రం రాజారావు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు కాళ్ల నరసింహ, కుటుంబ సభ్యులు నేతింటి నరసింహులు పాల్గొన్నారు.

నేడు యువ సమ్మేళనం

నందిగాం : మండలంలోని నౌగాంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు యువ సమ్మేళన సమావేశ నిర్వహిస్తున్నామని టిడిపి మండల అధ్యక్షులు తూలుగు మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమ్మేళనానికి టిడిపి అధ్యక్షులు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు మెండ దాసునాయుడులు ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. మండలంలోని కార్యకర్తలు, నాయకులు, యువకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చట్టాలపై అవగాహన అవసరం



రణస్థలం : మాట్లాడుతున్న భరణి

ప్రజాశక్తి- రణస్థలం

చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండి నేరాల నియంత్రణకు సహకరించాలని ఎక్సైజ్ ప్రొహిబిషన్ కోర్టు ఎంఎఫ్ సి.డి.భరణి సూచించారు. మండలంలోని కోష్ట గ్రామ సచివాలయంలో న్యాయ సలహాలు, నేరాల నియంత్రణపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లోక్ అదాలత్ ద్వారా కేసులను రాజీ కుదుర్చుకొని సత్వర న్యాయం పొందవచ్చన్నారు. కక్షిదారులు కేసులను రాజీ కుదుర్చుకోవడంతో విలువైన సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవచ్చని సూచించారు. గ్రామ సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలను కొనియాడారు. మహిళా పోలీసుల ద్వారా సమాచార సేకరణ వేగవంతమయ్యిందన్నారు. చిన్న కారణాలకే తగువుపడి, రాజీపడాలనుకునే భార్యాభర్తలను, కుటుంబాలకు అవగాహన కల్పించి రాజీ చేయాలని తెలిపారు. ప్రజల వద్దకే న్యాయ సేవలు అందించడం ద్వారా వారికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించే అవకాశం ఉందన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు సత్వర పరిష్కారం అవుతాయని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని న్యాయవాది శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బ్యాంకులు, విద్యుత్, ఎక్సైజ్, కుటుంబ సంబంధిత తదితర కేసులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. చిన్న చిన్న కేసులకూ కోర్టుల చుట్టూ తిరిగి డబ్బు, కాలం వృథా చేసుకోవద్దని సూచించారు. గ్రామాల్లో ఇటువంటి న్యాయ సలహాలు అందించే కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతో ప్రజలకు అవగాహన పెరుగుతుందని ఎంపిటిసి అసిరినాయుడు అన్నారు. లోక్ అదాలత్ ద్వారా ఇప్పటికే తమ గ్రామంలో కొన్ని కేసులు పరిష్కారం అయ్యాయన్నారు. అనంతరం భరణిని సచివాలయ ఉద్యోగులు సన్మానించారు. కార్యక్రమంలో సిఐ స్వామినాయుడు, కార్యదర్శి హైదర్ అలీ, మహిళా పోలీస్ బమ్మిడి అమ్మోజీ, హేమ నళిని, నీలకంఠం, రాము నాయుడు,ఈశ్వరరావు, అమ్మాజీరావు పాల్గొన్నారు.

కేసులు వద్దు రాజీయే ముద్దు

ఆమదాలవలస : కేసులు వద్దని రాజీయే ముద్దు అని జూనియర్ సివిల్ జడ్జ్ ఎస్.మణి అన్నారు. కోర్టు ఆవరణలో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షణికావేశంలో గొడవలు పడి విలువైన కాలాన్ని డబ్బులను వృథా చేసుకోవద్దని అన్నారు. గ్రామస్థాయిలోనే తగాదాలను పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు డోర్ టు డోర్ లీగల్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. పలువురు మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కణితి విజయలక్ష్మి, సీనియర్ న్యాయవాదులు సిపాన గోవిందరావు, బొడ్డేపల్లి మోహనరావు, తమ్మినేని అన్నంనాయుడు, హనుమంతు అచ్చంనాయుడు, సనపల ప్రసాద్, గోవింద రాజులు, సిఐ పైడయ్య, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



టెక్కలి : మాట్లాతున్న తేజచక్రవర్తి



ఆమదాలవలస : అవగాహన కల్పిస్తున్న జడ్జి మణి

టెక్కలి : ప్రజలు వస్తువులు క్రయ విక్రయాల్లోను, కొనుగోళ్లలోను మోసాలకు గురవుతుంటారని, అటువంటి వారు చట్టాలపై అవగాహన కల్పించుకుంటే మోసపోకుండా ఉంటారని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఎస్.హెచ్.ఆర్.తేజచక్రవర్తి మల్ల అన్నారు. మండలంలోని బొప్పాయిపురంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుజ్జు మోహన్‌రెడ్డి, న్యాయవాదులు ఎస్.ధర్మరాజు, వైకుంఠరావు పాణిగ్రాహి, ఎపిపి పి.ఆనంద్, పి.మధుబాబు, కార్యదర్శి పాల రవికుమార్‌రెడ్డి, కార్యదర్శి ఎస్.వైకుంఠరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : ఆజాదికా అమృత మహోత్సవంలో భాగంగా పాన్ ఇండియా రెండో విడత కార్యక్రమం టెక్కలి గ్రామ సచివాలయంలో మండల న్యాయ సేవా సంఘం టెక్కలి గ్రామ పంచాయతీ 1,2,3 సచివాలయాల్లో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు ఎస్.ధర్మరాజు మాట్లాడుతూ జన్మదిన రికార్డ్స్ ప్రామిసరీనోటు ప్రభుత్వ కార్యక్రమాలు భూములు రిజిస్ట్రేషన్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గొండెలి సుజాత, కార్యదర్శి బి.రామారావు, ఉపాధ్యక్షులు రెడ్డి ధర్మారావు, న్యాయవాదలు కృష్ణారావు, పి.మధుబాబు పాల్గొన్నారు.

రైతులపై దాడి అమానుషం

ప్రజాశక్తి- పలాస

మండలంలోని బొడ్డపాడుకు చెందిన రైతులపై, మహిళలపై సర్పంచ్ తామడ మదన్, విఆర్ఒ దాడి చేయడం అమానుషమని సిపిఎం నాయకులు ఎన్.గణపతి అన్నారు. పలాస ప్రభుత్వాస్పత్రి వద్ద బాధిత రైతులను శనివారం పరామర్శించారు. రైతులకు అండగా సిపిఎం పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బొడ్డపాడు రైతులపై ప్రభుత్వ అధికారులు వివక్ష చూపడం సరైనది కాదన్నారు. స్థానిక రాజకీయ నాయకులు జోక్యం చేసుకుని రైతులపై దాడి చేయడంతో బాధిత రైతులు పోలీసులకు, తహశీల్దార్‌కు విన్నవించినా పట్టించుకోకపోవడంతో పలాస కోర్టుకు వెళ్లి మొరపెట్టుకోవాల్సి వచ్చిందన్నారు. దీని బట్టి చూస్తే పలాస అధికారుల పనితీరు ఎలా ఉందో, రైతులకు న్యాయం ఎలా చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చున్నారు. రైతులకు నష్టపరిహారం చెల్లించకుండా జగనన్న కాలనీకి రైతుల భూములను ఏలా కేటాయిస్తారని ప్రశ్నించారు. దౌర్జన్యంగా భూములను తీసుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. సమస్య తలెత్తినప్పుడు పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అటువంటి అధికారులే రైతులపై దాడులకు పాల్పడడం దారుణమన్నారు. రైతులకు అనుకూలంగా హై కోర్టు స్టే ఇచ్చినా రైతులపై దౌర్జన్యం చేసైనా భూమిని ఎందుకు లాక్కోవాలని చూస్తున్నారని, ఇందులో ఎవరి ప్రయోజనాలు దాగి ఉన్నాయో తేల్చాలని డిమాండ్ చేశారు. ఈయనతో పాటు ఎఐసిసిటియు నాయకులు బి.వాసుదేవరావు ఉన్నారు.

చర్యలు తీసుకోవాలి : జనసేన

మండలంలోని బొడ్డపాడులో జగనన్న ఇళ్ల కాలనీ వద్ద సర్పంచ్ తామడ మదన్, బాధిత రైతుల మధ్య గొడవలో కోపోద్రేకుడైన విఆర్ఒ బండబూతులు తిడుతూ అసభ్య పదజాలంతో దూషిస్తూ మహిళలపై, రైతులపై దాడి చేయడం అమానుషమని, దాడికి పాల్పడిన విఆర్ఒతో పాటు వ్యక్తులపై కఠినంగా చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు దుర్గారావు డిమాండ్ చేశారు. మహిళ రైతులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బాధిత మహిళలకు న్యాయం జరిగే వరకూ జనసేన అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.



బాధిత రైతులను పరామర్శిస్తున్న గణపతి

చిత్రలేఖనంతో సృజనాత్మకత పెంపు

లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా అధ్యక్షులు హారికా ప్రసాద్



చిత్రలేఖనం ఫలితాలను వెల్లడిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

చిత్రలేఖనంతో చిన్నారుల్లో సృజనాత్మక శక్తిని వెలికి తీయవచ్చునని లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా అధ్యక్షులు హారికాప్రసాద్ అన్నారు. నగరంలోని జిటి రోడ్డులో ఉన్న మీనా కృష్ణ ప్లాజాలో అక్టోబరు 23న పీస్ ఆఫ్ పోస్టర్ అనే అంశంపై నిర్వహించిన చిత్రలేఖన పోటీల ఫలితాలను కమిషనర్ చల్లా ఓబులేసు శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా హారికాప్రసాద్ మాట్లాడుతూ చిన్నారులకు శాంతి, సేవాతత్వం వంటి సుగుణాలను పాఠశాల స్థాయి నుంచి అలవర్చుకోవాలన్నారు. వారు ఎంచుకున్న రంగాల్లో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. ఈ సందర్భంగా విజేతల వివరాలను వెల్లడించారు. సబ్ జూనియర్ విభాగంలో ఆర్.శ్రీనిధి ప్రథమ (గీతాంజలి), ఎం.గాయత్రి ద్వితీయ (ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాల), ఎస్.రేష్మశ్రీ తృతీయ (శ్రీసాయి విద్యామందిర్), ఎస్.సాయి శ్రీనిధి నాలుగో స్థానం (అక్షర స్కూల్) గెలుపొందారు. అలాగే జూనియర్స్ విభాగంలో సిహెచ్.ప్రేమ్‌కుమార్ ప్రథమ (ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాల), ఎ.హేమంత్ ద్వితీయ (ప్రభుత్వ ఉన్నత పాఠశాల), ఎస్.దీపిక తృతీయ (సిద్ధార్థ హైస్కూల్), చరణ్ తేజ నాలుగో స్థానం (ప్రభుత్వ ఉన్నత పాఠశాల) గెలుపొందారు. అలాగే సీనియర్స్ విభాగంలో ఎ.శ్యామస్వరూప్ ప్రథమ (సిఎస్ఎన్ఎం హైస్కూల్), జి.ఆకాష్ ద్వితీయ (ఆక్స్‌ఫర్డ్), పద్మశ్రీ తృతీయ (శ్రీసాయి విద్యా మందిర్), బి.హాసిని నాలుగో స్థానం (నారాయణ స్కూల్), జె.కూర్మనాథ్ (శ్రీసాయి విద్యా మందిర్) ఐదో స్థానంలో నిలిచారు.

'ఐతమ్' విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల బిటెక్ మూడో ఏడాది విద్యార్థులకు ఎపిఎస్ఎస్‌ఎసి ఐతమ్ ఆధ్వర్యాన హైదరాబాదు ఆర్ఎవిఎస్ క్వాలిటీ సర్టిఫికేషన్ ప్రయివేట్ లిమిటెడ్‌లు సంయుక్తంగా వారం రోజుల పాటు నిర్వహించే శిక్షణా తరగతుల్లో 210 మంది విద్యార్థులు పాల్గొంటున్నారని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. వెల్డింగ్ టెక్నాలజీ మెథడ్స్, ఇన్స్పెక్షన్ మెథడ్స్ ఆఫ్ వెల్డింగ్ ప్రొసెస్, రేడియోగ్రాఫిక్ అండ్ అల్ట్రాసోనిక్ టెస్టింగ్ మేగ్నెటిక్ పార్టిసియల్ ఇన్స్పెక్షన్ వంటి అంశాలపై శిక్షణ ఇవ్వడం ద్వారా ఆయా రంగాల్లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. అబ్దుల్ గఫూర్, రాజ్కుమార్లు శిక్షకులుగా వ్యవహరిస్తున్న ఈ తరగతులను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెబ్బాడి డాక్టర్ డి.శ్రీరాములు, ఎపిఎస్ఎస్‌ఎసి స్పాక్ డాక్టర్ వి.అశోక్కుమార్, మెకానికల్ విభాగ కో-ఆర్డినేటర్ ఎ.సతీష్‌కుమార్‌లు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.



శంకుస్థాపన చేస్తున్న నాయకులు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం భావనపాడులో పలు అభివృద్ధి పనులను వైసిపి మండల నాయకులు, సర్పంచ్ బి.మోహన్‌రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కృషితో భావనపాడు గ్రామ సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయని అన్నారు. గ్రామ పంచాయతీలోని మధ్యపేట, వాడపేట, కొత్తపేట గ్రామాల్లో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలు ప్రారంభించామని చెప్పారు. కార్యక్రమంలో సంతబొమ్మాళి జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, పిఎసిఎస్ అధ్యక్షులు కెళ్లి జగన్నాయకులు, ఎంపిపి ప్రతినిధి మేరుగు అప్పారావు, వైస్ ఎంపిపి ప్రతినిధి నక్క భీమారావు, మార్పు నాగభూషణరావు, ఎంపిటిసి రాజ్యలక్ష్మి, అప్పారావు, కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రభుత్వ ఆస్తులను కబ్జా చేసిన అయ్యన్నపాత్రుడిపై అధికారులు చర్యలు తీసుకుంటే ఆ విషయమై ప్రభుత్వాన్ని నిందిస్తూ టిడిపి నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి రొక్కం సూర్యప్రకాశ రావు అన్నారు. వైసిపి జిల్లా కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. చట్టాలను, న్యాయస్థానాలను గౌరవించుకునే సంస్కృతి వైసిపిదని, అయ్యన్నపాత్రుడు కబ్జా చేసిన స్థలం ప్రభుత్వానిదేనని న్యాయస్థానం చెప్పినా అక్రమ నిర్మాణం ఏ విధంగా చేపడతారని ప్రశ్నించారు. ఆ స్థలం ఇరిగేషన్ శాఖకు సంబంధించిందేనని, దొంగ డాక్యుమెంట్లు సృష్టించి అయ్యన్నపాత్రుడు నేరాలకు పాల్పడుతుంటే రాజ్యాంగం ప్రకారం చట్టబద్ధంగా అధికారులు చర్యలు తీసుకుంటే దానిని జగన్మోహనరెడ్డి ప్రభుత్వంపై టిడిపి నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఉత్తరాంధ్ర అభివృద్ధికి విశాఖపట్నం పరిపాలనా రాజధాని కోసం ఆయన పదవినీ వదులుకోవడానికి సిద్ధమయ్యారని అన్నారు. పోలీసులపై, అధికారులపై టిడిపి నాయకులు దుష్ప్రచారం చేస్తూ హెచ్చరికలు చేయడం తగదని అన్నారు.



రోడ్డు పక్కన వేసిన నాసికరం మట్టి

నాసిరకం మట్టితో పనులా!

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డు బాలురు వసతిగృహం సమీపంలో మూడున్నరేళ్లు రహదారిపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో భారీ వాహనాలు దిగబడడం, వాహనదారులు, ప్రయాణికులు అష్టకష్టాలు పడ్డారు. దీంతో పాలకులు, అధికారులు స్పందించి ఎట్టకేలకు సిమెంట్ రోడ్డును నిర్మించారు. కాలువ పనులు చేపడుతున్నారు. అయితే రహదారికి ఇరువైపులా గ్రావెల్, కంకర మట్టి వేయాల్సి ఉంది. కానీ, కాంట్రాక్టర్ రోడ్డుకు ఇరువైపులా మట్టి వేయడంతో వాహనాలు దిగుబడి ప్రమాదాలు తప్పవని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై రోడ్లు భవనాలు శాఖాధికారి జెఇ కిరణ్ కుమారును వివరణ కోరగా... కచ్చితంగా గ్రావెల్, కంకర మట్టి వేయాలన్నారు. చెత్త, మట్టి వేసి ఉంటే తొలగింపు చర్యలు చేపడతామని తెలిపారు.



బీమా అందజేస్తున్న బలరాంనాయుడు

వైఎస్ఆర్ బీమా అందజేత

బూర్జ: మండలంలోని పాలవలస పంచాయతీ పరవస్తురామన్నపేటకు చెందిన నాయుడు దుర్గారావు ఇటీవల మృతి చెందాడు. ఆ కుటుంబానికి వైఎస్ఆర్ బీమా వర్తించడంతో తక్షణ సాయం కింద రూ.పది వేలు డిసిఎంఎస్ సభ్యులు జల్లు బలరాం నాయుడు సచివాలయంలో శనివారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రతినిధి జల్లు అప్పలస్వామి నాయుడు, కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్ రాజశేఖర్, వాలంటీర్ పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

మండలంలోని పాలవలస కుమ్మరివీధిలో శుక్రవారం రాత్రి సంభవించిన అగ్నిప్రమాదంలో వెయ్యి వరకు మట్టి కుండలు, ప్రమిధలు, తదితర పరికరాలు మాడి మసయ్యాయి. సమయానికి అగ్నిమాపక సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ జల్లు బలరాంనాయుడు, విఆర్ఒ రమణమ్మ, సచివాలయ సిబ్బంది బాధితులను పరామర్శించారు.

అన్ని పంచాయతీల్లో 'ఉపాధి' పనులు

డ్వామా పీడీ చిట్టిరాజు

రణస్థలం: జిల్లాలోని అన్ని పంచాయతీల్లోనూ ఉపాధి హామీ పథకం పనులు చేపట్టాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి.చిట్టి రాజు అన్నారు. మండలంలోని కొండములగాంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను వనివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కందకాల తవ్వకం, ప్లాంటేషన్ పనులు, ఇంకుడు గుంతలు, ఇతర పనులను ప్రస్తుతం చేపట్టాలన్నారు. కూలీలకు కనీస కూలి రూ. 250 వచ్చే విధంగా పనులు చేయించాలన్నారు. ఉపాధి హామీ అమలులో జిల్లా అగ్రస్థానంలో ఉండే విధంగా సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. తద్వారా గ్రామాల్లో మౌలిక వసతులు కల్పన, వ్యవసాయ రంగం అభివృద్ధి వంటివి పనులు చేపట్టితే గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తాయని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎపిఒ శ్రీనివాసనాయుడు, ఇసి గౌరీకృష్ణ పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న పీడీ చిట్టిరాజు

అంతర్జాతీయ వేదికపై సిక్కోలు పారిశ్రామికవేత్త



పురస్కారం అందుకుంటున్న ప్రకాష్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

అంతర్జాతీయ వేదికపై సిక్కోలు పారిశ్రామిక వేత్త ఎదుగుతున్న డాక్టర్ బలగ ప్రకాష్ ప్రసంగించారు. మారుమూల పల్లెలో జన్మించి అంతర్జాతీయ లండన్ పార్లమెంట్‌లో పురస్కారం అందుకున్న అరుదైన ఘట్టాన్నీ ప్రకాష్ సిక్కోలు కీర్తిపతాకాన్ని అంతర్జాతీయ యవనికపై రెపరెపలాడించారు. నందిగామ మండలం బడగాంకు చెందిన బలగ ప్రకాష్ ఈ నెల 4న లండన్‌లోని హౌస్ ఆఫ్ లండన్‌లో నిర్వహించి ఇండో-యూకె గ్లోబల్ బిజినెస్ కాంక్లేవ్-2022 నిర్వహించి కార్యక్రమంలో ఆ దేశ మంత్రి రూత్ కేడ్బరీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అదే విధంగా పార్లమెంట్ ప్రతినిధులు దినేష్ ధామీజ, నవనీత్ దొలకియా, వీరేంద్ర శర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఔత్సాహిక వ్యాపార వేత్తగా ప్రకాష్ ప్రస్థానాన్ని ఈ సదస్సు కొనియాడింది. ఇక మారుమూల పల్లె నుంచి ఎటువంటి అవకాశాలు లేని పరిస్థితుల నుంచి, ఏ ఆదరణ దక్కని పరిణామాల నుంచి ప్రతి సమస్యను అవకాశంగా మలచుకుని ఆయన సాగించిన విజయ ప్రస్తానాన్ని అభినందించారు. ఈ వేదికపై లండన్ ప్రతినిధుల చేతులమీదుగా పురస్కారాన్ని అందజేశారు. ఆయనకు అంతర్జాతీయ వాణిజ్య రంగంవైపు దృష్టి సారించేందుకు ప్రయత్నించాలని ఈ సదస్సుకు హాజరైన పలువురు ప్రతినిధులు సూచించారు.

ముగిసిన స్వర్ణోత్సవాలు

కవిటి: మండలంలోని జగతిలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న వీరాంజనేయస్వామి స్వర్ణోత్సవ వేడుకలు శనివారంతో ముగిశాయి. ఈ వేడుకలో ఎంపీ రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే బెందాలం అశోక్ పాల్గొన్నారు. కమిటీ సభ్యులు వారిని ఆలయ మర్యాదలతో సత్కరించారు. అనంతరం నిర్వహించిన అన్నదానంలో పరిసర ప్రాంతాల నుంచి ఏడు వేల మంది యాత్రికులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు.



దర్శించుకుంటున్న ఎంపీ, ఎమ్మెల్యే

సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రభుత్వ పథకాలు అమలుపై వెలుగు ఎపిఎం ప్రసాదరావు ఆధ్వర్యాన మండలంలోని 37 సంఘాల అధ్యక్షులు, సిబ్బందితో శనివారం సమీక్షించారు. ముందుగా జగనన్న తోడు పథకంలో వీధి వ్యాపారులు, తోపుడుబండ్లు నిర్వహిస్తున్న వారికి రూ.పదేసి వేలు బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాలను మండలంలోని 402 మంది సభ్యులకు ఇచ్చేందుకు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు రుణాలు అవసరమైన వారికి సంఘం, బ్యాంకు ద్వారా స్పెషల్ రూ.35 వేలు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మండలానికి గొర్రెల పిల్లల పెంపకానికి వంద యూనిట్లు మంజూరయ్యాయని అన్నారు. లబ్ధిదారులను గుర్తించాలన్నారు. ఒక్క యూనిట్‌కు ఏడు గొర్రె పిల్లలు అందజేస్తామన్నారు. 90 కేజీలు బరువు ఉన్న వాటికి రూ.50 ఇన్స్యూరెన్స్‌తో కలిపి చెల్లించే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. పెరటి కోళ్ల పెంపకానికి వంద యూనిట్లు మంజూరయ్యాయని, లబ్ధిదారులు గుర్తించాలని సూచించారు.

మటన్ సెంటర్లు ఏర్పాటు ప్రతి మండలంలో నాణ్యమైన మాంసపు దుకాణాలు ఏర్పాటుకు 75 శాతం సబ్సిడీతో రూ.16 లక్షలు విలువైన యూనిట్‌లు ఏర్పాటుకు లబ్ధిదారులను గుర్తించాలన్నారు. ప్రతి మండలంలోనూ వంద రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేయాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్‌లో హయ్యర్ ఆర్డర్ ఎంటర్ప్రైజెస్‌లో భాగంగా రూ.10 లక్షల రుణానికి, రూ.3.5 లక్షలు సబ్సిడీ వర్తిస్తుందన్నారు. ఆహార ఉత్పత్తులు తయారు చేస్తున్న సభ్యులను ఎంపిక చేసి బ్యాంకు ద్వారా అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు రామకృష్ణ, అర్బన్ హౌసింగ్ అధికారి సిహెచ్.మల్లేశ్వరరావు, సిసి మోహనరావు, కె.మోహిని, అకౌంటెంట్ విష్ణుబాబు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న ఎపిఎం ప్రసాదరావు

'ఎన్ఇఆర్' స్కూల్‌కి అంతర్జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న సాయిచంద్

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని నడుకుదిటిపాలెంలో ఉన్న ఎన్ఇఆర్ స్కూల్‌కి ఇండో-యుకే గ్లోబల్ బిజినెస్ ఎంక్లేవ్‌లో 'ఇన్నోవేటివ్ టీచింగ్-లెర్నింగ్ ప్రాక్టీసెస్ అండ్ హోలిస్టిక్ డెవలప్‌మెంట్ కోసం ప్రామిసింగ్ స్కూల్' అవార్డు దక్కింది. అవార్డు ప్రదానోత్సవం లండన్‌లోని హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో జరిగింది. ఈ అవార్డును స్కూల్ డైరెక్టర్ ఎన్.సాయిచంద్ అందుకున్నారు. ఈ అవార్డు ప్రదానోత్సవంలో ముఖ్య అతిథులుగా బ్రిటన్ అంతర్జాతీయ వాణిజ్య వ్యవహారాల మంత్రి రుత్ క్యాడ్బరి, భారత్, బ్రిటన్ యురోపియన్ పార్లమెంటరీ కమిటీ చైర్మన్ దినేష్ ధమిజా, బ్రిటన్ పార్లమెంట్ ఎంపీలు పాల్గొన్నారు. ఈ అవార్డు రావడంపై స్కూల్ చైర్మన్ నడుకుదిటి ఈశ్వరరావు, స్కూల్ డైరెక్టర్ ఎన్.తేజ హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డుతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. భవిష్యత్‌లో మరింత కష్టపడి స్కూల్‌ను ఉన్నత శిఖరాలపై నిలబెడతామన్నారు. ఈ ప్రయత్నంలో పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్న స్కూల్ సిబ్బంది, విద్యార్థుల తల్లితండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

అవినీతిరహిత సమాజంతోనే అభివృద్ధి

నరసన్నపేట : అవినీతి రహిత సమాజంతోనే దేశ అభివృద్ధి సాధ్యమని పద్మావతి కళాశాలల డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్ అన్నారు. స్థానిక పద్మావతి జూనియర్ కళాశాలలో సంపత్ వినాయక గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యాన విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి చెందిన భారత దేశం - అవినీతి రహిత భారత దేశం అన్న నినాదంతో ఈ నెల 6 వరకు అవగాహనా వారోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. ఇదే నినాదంపై తమ కళాశాలలో సెమినార్లు, ర్యాలీలు, వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. అవినీతి నిరోధక చర్యలపై పోస్టర్లను ముద్రించి ప్రజల్లో అవగాహన పెంచే ప్రయత్నం చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులతో జాతీయ సమైక్యత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు చిన్న అప్పన్న, గిరి పాల్గొన్నారు.

శ్రీకాకుళం : లంచానికి వ్యతిరేకంగా యువత పోరాడాలని యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ గురునాథరావు అన్నారు. జాగరుకతా వారోత్సవాల్లో భాగంగా యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా జిల్లా రీజనల్ ఆఫీస్ తరపున విజిలెన్స్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డే అండ్ నైట్ కూడలి నుంచి అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డే అండ్ నైట్ కూడలిలో మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ హెడ్ ప్రేమ్‌బాబు, దుర్గా ప్రసాద్, చీఫ్ మేనేజర్లు కృష్ణ, మాధురి, పవన్ మండల్, విజిలెన్స్ ఆఫీసర్ రాజశేఖర్, ఆఫీసర్ సంఘ రీజనల్ నాయకులు తేజేశ్వరరావు ఉద్యోగుల సంఘ నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.



నరసన్నపేట : మాట్లాడుతున్న డైరెక్టర్ దుర్గాప్రసాద్



సోంపేట : మాట్లాడుతున్న ఆర్‌డిఒ సీతారామ్మూర్తి



ఇచ్ఛాపురం : రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్ రమేష్

సచివాలయాలు పరిశీలన

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని కొర్లం సచివాలయాన్ని పలాస ఆర్‌డిఒ సీతారామ్మూర్తి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం సచివాలయం ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని సూచించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డిటి ఎన్.రమేష్ కుమార్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : పట్టణంలోని 9,10,14,15 వార్డుల్లోని సచివాలయాలను మున్సిపల్ కమిషనర్ రమేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయాల్లో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విధుల్లో అందరూ బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. సచివాలయాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరడానికి అంకితభావంతో పనిచేయాలని తెలిపారు. విధినిర్వహణలో నిర్లక్షం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- పలాస

బ్యాంకు లావాదేవీలతో పాటు సెల్‌ఫోన్ల ఖాతాల నిర్వాహణలో అప్రమత్తంగా ఉంటేనే మోసాలను అరికట్టవచ్చునని పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.ఆదినారాయణ రెడ్డి అన్నారు. పలాస భారతీయ స్టేట్ బ్యాంకు ఆధ్వర్యాన జాతీయ సమగ్ర అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాప్‌లో వచ్చే సమాచారంపై పూర్తిగా తెలుసుకున్న తర్వాతనే ఓటిపి, సమాచారం అందించాలని అన్నారు. తొందరపడి సెల్‌ఫోన్ల గేమ్స్ బెట్టింగులు వంటి వాటికి పాల్పడి నగదు పోగొట్టుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు చీఫ్ మేనేజర్ పుష్పలత, పలాస ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ జి.బాబురావు, ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

బూర్జ : సైబర్ నేరాలపై ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని ఎపిజివిబి బ్రాంచ్ మేనేజర్ సిహెచ్.కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని ఉప్పేట లో బ్యాంకు సేవలపై, జాతీయ సమగ్రపై శనివారం అవగాహన పాల్గొన్నారు. సైబర్ నేరాలపై మోసపోతున్న తీరు ఏ విధంగా, ఎలా జాగ్రత్తపడాలి అనే అంశంపై అగాహన కల్పించారు. కస్టమర్ కేర్ సర్వీస్ సెంటర్లకు ఎలా ఫిర్యాదు చేయాలో తెలియజేశారు. ఎటిఎం పిన్, ఓటిపి, పాస్వర్డ్, సివివి నంబరు ఎవరికీ చెప్పకూడదన్నారు. అనుమానిత లింకులపై మెసేజ్‌లపై క్లిక్ చేయరాదని తెలిపారు. ఈ నెలాఖరు వరకు ఈ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో క్యాషియర్ నవీన్‌కుమార్, బ్యాంకు మిత్ర వెంకటరమణమూర్తి, సిఎఫ్ వసంతకుమారి, కుసుమకుమారిలు పాల్గొన్నారు.



పలాస : మాట్లాడుతున్న ఆదినారాయణరెడ్డి



బూర్జ : అవగాహన కల్పిస్తున్న మేనేజర్ కిరణ్ కుమార్



ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

న్యాయం చేయాలని రైతుల ర్యాలీ

ప్రజాశక్తి- పలాస

మండలంలోని బొడ్డపాడులో ఇటీవల రైతులకు జరిగిన దాడిపై జైభీం, బొడ్డపాడు యువజన సంఘం ఆధ్వర్యాన గ్రామస్తులు శనివారం రాత్రి రైతులకు న్యాయం చేయాలని ర్యాలీ చేపట్టారు. రైతులపై దాడి చేసిన ప్రజా ప్రతినిధులపై, అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. గతంలో ఎన్నడూ ఈ విధంగా రైతులపై దాడులు జరగలేదని, ఇటువంటి ఘటనలపై తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో జైభీం యువజన సంఘం అధ్యక్షులు కిక్కర ఢిల్లీరావు, బొడ్డపాడు యువజన సంఘం అధ్యక్షులు తామడ క్రాంతి, వివిధ సంఘాల నాయకులు, బొడ్డపాడు, మామిడిపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.



జ్ఞాపకను అందుకుంటున్న కృష్ణమూర్తి

'తెప్పల'కు రంగస్థల పురస్కారం

ప్రజాశక్తి- పలాస

రంగస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యాన శ్రీకాకుళంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి నాటిక పోటీలో రంగస్థల కార్యవర్గ సభ్యుడు, జన జాగృతి వ్యవస్థాపకుడు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తికి రంగస్థల పురస్కారం లభించింది. ఆయనకు రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు శనివారం జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, సాహిత్య అకాడమి డైరెక్టర్ జె.జె.మోహన రావు, సంస్థ అధ్యక్షులు చిట్టి వెంకటరావు, డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావులు కృష్ణమూర్తికి అభినందనలు తెలిపారు.



మాట్లాడుతున్న కృష్ణారావు

52 జిఒను రద్దు చేయాలి

మెళియాపుట్టి: జిఒ 52ను రద్దు చేయాల్సిందేనని ఆదివాసీ చైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరహాల కృష్ణారావు అన్నారు. మండలంలోని నందవ గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బోయ, వాల్మీకి, నకిలీ బెంతు ఒరియాలను షెడ్యూల్ తెగల జాబితాలో చేర్చవద్దని, శామ్యూల్ కమిషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 70 ఏళ్ళుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులపై అలసత్వం వహిస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎల్.కిరణ్, సరవ కుమార్, సవర రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ గిరిబాబు

కాలువ నిర్మాణ పనులు పరిశీలన

పలాస: పలాస-కాశీబుగ్గ కెటి రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా చేపడుతున్న కాలువ పనుల్లో నాణ్యత పాటించాలని, ఇష్టానుసారంగా నిర్మాణ పనులు చేపడితే సహించేది లేదని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు కాంట్రాక్టరుకు, అధికారులకు హెచ్చరించారు. పలాస జీడి పిక్క బొమ్మ కూడలిలోలో చేపడుతున్న కాలువ పనులు, పలాస శివజీనాగర్‌లో మదర్ థెరిసా స్కూల్ నుంచి సూదికొండ వరకు రోడ్ ఇరువైపుల రూ.2.45 లక్షలతో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభాల పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈయనతో పాటు మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్‌కుమార్ ఉన్నారు.



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న రాజ్యలక్ష్మి

యాత్రికుల సౌకర్యార్థం మరుగుదొడ్లు

ఇచ్ఛాపురం: స్థానిక రామలింగేశ్వర ఆలయంలో యాత్రికుల సౌకర్యార్థం కీర్తిశేషులు పాక చిన్నయ్యరెడ్డి, పాపమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు యాదవరెడ్డి బ్రదర్స్ ప్రజా మరుగుదొడ్లను నిర్మించారు. వీటిని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి శనివారం ప్రారంభించారు. యాత్రికుల సౌకర్యార్థం దాతలు ముందుకొచ్చి ఇటువంటి సౌకర్యాలు కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి, 23వ వార్డు కౌన్సిలరు గువ్వాడ ప్రదీప్‌కుమార్, కౌన్సిలర్ బచ్చు జగన్, రామలింగేశ్వర ఆలయ అభివృద్ధి కమిటీ ప్రెసిడెంట్ పాక తులసీదాస్, సెక్రటరీ గుజ్జు కూర్మారావు, పాక యాదవరెడ్డి, ప్రకాశరావు పట్నాయక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం

పలాస: వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలను ఆధునికీకరణతో పాటు పాఠశాలలను బలోపేతం చేస్తున్నారని పదో వార్డు కౌన్సిలర్ సర్వాన గీత అన్నారు. వార్డు పరిధిలోని పెంటవీధి ప్రభుత్వ పాఠశాలలో రెండో విడత నాడు-నేడు రూ.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న భవనం శ్లాబ్ నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి అప్పలరాజు, చైర్మన్ గిరిబాబు సహకారంతో పాఠశాలను అభివృద్ధి చేస్తున్నమన్నారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ అధ్యక్షులు చిత్తరెడ్డి శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేణుకాదేవి, సచివాలయం ఏమ్యునిటి సెక్రెటరీ వసంత, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

తేలని లెక్కలు

● సిబ్బందిపై చిర్రుబుర్రులు ● సమాచార గోప్యతపై అనుమానాలు

ప్రజాశక్తి- జలుమూరు

ఉపాధి పనుల్లో 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి లెక్కలు తేలలేదు. ఉపాధి పనుల్లో పని చేసిన ప్రదేశాల్లో బోర్డులు ఏర్పాటులో అవకతవకలు జరిగాయని ప్రజావేదికలోనే ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు గుసగుసలాడుకోవడం, డ్వామా పీడీ ఆదేశాల మేరకు వారం రోజుల్లో ఏర్పాటు చేయాల్సిన బోర్డులు సమయం దాటినా పని ప్రదేశాల్లో ఏర్పాటు చేయలేదు. దీనిపై ప్రజాశక్తి సమగ్ర సమాచారం కోరినా.. నేడు, రేపు అంటూ ఎపిఒ నారాయణరావు దాటవేత ధోరణి అవలంబించారు. ఈ నెల 3న పీడీ ఆదేశాలు బేఖాతరు' అని ప్రజాశక్తిలో కథనం వచ్చింది. దీనిపై ఎంపిడిఒ జీవి రవికుమార్ సమక్షంలో ఎపిఒ సిబ్బందిని పిలిపించి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు ఎంపిడిఒ కలుగజేసుకుని తప్పు చేయనప్పుడు భయం ఎందుకని కార్యదర్శులు, ఆయా పంచాయతీల నుండి వెనుకకు చెక్కు రూపంలో ఎంత ఇచ్చారు, ఎంత ఖర్చయింది, ఎంత మిగిలింది అనే వివరాలు ఇవ్వాలని ఎపిఒను సూచించారు.. కార్యాలయ సమాచారాన్ని బయటకు చేరవేస్తున్నారన్న నెపంతో సిబ్బంది మీద ఆగ్రహం వ్యక్తం చేశారు. శాఖాపరంగా వారిపై చర్యలు తీసుకుంటామని సిబ్బందిపై చిరుబుర్రులాడినట్లు సమాచారం. సమాచార హక్కు చట్టం ప్రకారం సమాచారం ఇవ్వకుండా ధాట వేట ధోరణి అవలంబిస్తున్న ఎపిఒపై జిల్లా అధికార యంత్రాంగం ఏం చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి.

చెత్తతో అవస్థలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండల కేంద్రంలో డంపింగ్ యార్డు సమస్య వేధిస్తోంది. ఇంటింటా, ప్రతి వీధిలో సేకరించిన చెత్తను వాహనాల్లో తీసుకొచ్చి నేరుగా కోటబొమ్మాళి స్థానిక పెద్ద చెరువు పక్క మంచాలపేటకు వెళ్లే రోడ్డుపక్కన, అలాగే కోటబొమ్మాళి నుంచి లఖందిడ్డి వెళ్లే రోడ్డు మార్గంలో వేస్తున్నారు. దీంతో ఈ మార్గంలో భరించలేని దుర్గంధం వెదజల్లుతోందని వాహనచోదకులు, ప్రయాణికులు వాపోతున్నారు. మండలంలో గతంలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులు మచ్చుకైన కానరావటంలేదు. గ్రామీణ ప్రాంతాల మాట ఎలా ఉన్నా కనీసం మండల కేంద్రంలోనైనా డంపిగ్ యార్డులు లేక గ్రామాల్లో తీసుకువచ్చిన చెత్తను గ్రామీణ రహదారులు పక్కనా, చెరువు, కాలువల కొట్టుపక్కన కుప్పలు కుప్పలుగా వేస్తున్నారు. అవి కుళ్లి దురవాసన వెదజల్లు ఉండటంతో అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపుల వేస్తున్న చెత్తను డంపిగ్ యార్డుల్లోనే వేయాలని సర్వాత్ర కోరుతున్నారు.



లఖందిడ్డి-గంగరాం రోడ్డులో వేసిన చెత్త

బూర్జలో ఫాగింగ్

బూర్జ : నివాస ప్రాంతాల సమీపంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బూర్జ కార్యదర్శి బలివాడ కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో దోముల మందును శనివారం ఫాగ్గింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం సీజన్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా దోమలు వ్యాప్తి చెందకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అనురాధ, గ్రామ పెద్దలు సురేష్, రాజారావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



సోంపేట : పరామర్శిస్తున్న సర్పంచ్ జోగారావు

పలువురు పరామర్శ

సోంపేట : మండలంలోని పలాసపురానికి చెందిన నెయ్యల షణ్ముఖరావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ తడక జోగారావు మృతుడి కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. గ్రామంలో నిర్వహించే శుభకార్యాలకు సప్లయి సామాగ్రి అద్దెకిస్తూ జీవనం సాగిస్తున్న షణ్ముఖరావు మృతిపై సర్పంచ్ తన సానుభూతి వ్యక్తం చేశారు. ఈయనతో పాటు తెంబ వాసుదేవరావు ఉన్నారు.

జి.సిగడాం : మండలంలోని వెలగాడ మాజీ సర్పంచ్ పిడిగి మల్లేశ్వరరావు ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. ఈ విషయాన్ని తెలుసుకున్న టిడిపి మండల అధ్యక్షులు కుమారపు రవికుమార్, టిడిపి నాయకులు మల్లేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి జక్కంపూడి దాస్ శనివారం పరామర్శించారు. ఈయన వెంట ఉపాధ్యక్షులు బుజ్జి, లీగల్ సెల్ జనరల్ సెక్రెటరీ మురళి, మధుపం సర్పంచ్ బగాది అప్పలనాయుడు, దేవరవలస సర్పంచ్ వెంకటరావు, జగన్నాథవలస మాజీ సర్పంచ్ బంగారునాయుడు, కొత్తపేట మాజీ సర్పంచ్ గొల్లజి, త్రినాథ్, భాస్కరరావు ఉన్నారు.

లావేరు: మండలంలోని పెద్ద కొత్తకోట పంచాయతీ చిన్న కొత్తకోట గ్రామానికి చెందిన బగ్గు కాశి ఈ నెల 3న అనారోగ్యంతో మృతి చెందారు విషయం తెలుసుకున్న వైసిపి ఎచ్చెర్ల నియోజకవర్గ సీనియర్ నాయకులు లుకలాపు అప్పలనాయుడు మృతుని కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రగాఢ సంతాపం తెలిపారు. కొత్తకోట సర్పంచ్ శాంతాటి భాస్కరరావు, మాజీ ఎంపిటిసి గుమ్మడి దుర్గారావు, కొత్తకుంకాం ఎంపిటిసి దొండపాటి చిరంజీవి, డి.వాసు, మేడబోయిన శ్రీనివాసరావు, మీసాల నారాయణరావు, పతివాడ గురునాయుడు పాల్గొన్నారు.



పౌష్టికాహారాన్ని అందజేస్తున్న రాజశేఖర్

పౌష్టికాహారం పంపిణీ

కోటబొమ్మాళి: అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టిక ఆహారం అందజేస్తుందని, దీనిని గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని చిన్నసాన ఎంపిటిసి నంబాళ రాజశేఖర్ అన్నారు. మండలంలోని తర్లిపేట పంచాయతీ చలమయ్యపేట, తర్లిపేట గ్రామాల అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం పంపిణీ చేసిన జగనన్న పౌష్టిక ఆహారాన్ని సర్పంచ్ శ్రీనువాస్ శనివారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారంతో పిల్లలు ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.



పలాస : మాట్లాడుతున్న గౌతు శిరీష

విస్తృతంగా ఓటరు నమోదు

ప్రజాశక్తి- పలాస

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు విస్తృతం చేయాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష టిడిపి నాయకులు, కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం సాయంత్రం టిడిపి నాయకులు, కార్యకర్తలతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు వేగవంతం చేయాలని కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాలంటే పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, రాష్ట్ర బిసిసెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, జిల్లా కార్యదర్శి పి విఠల్‌రావు, గాలి కృష్ణారావు, టిడిపి మండల అధ్యక్షులు కుత్తుం లక్ష్మణ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, అంబటి కృష్ణారావు, బూరెల కృష్ణరాజు, టి.గంగారాం, వంకల కూర్మారావు, వడ్డి యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టభద్రులు ఓటర్లు త్వరితగతిన నమోదు చేసుకోవాలని వైసిపి నాయకులు చింతాడ రవికుమార్ పిలుపునిచ్చారు. జగనన్న ప్రజాసేవ కార్యాలయ ఆవరణలో శనివారం విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని ఆమదాలవలస, పొందూరు, బూర్జ మండల కేంద్రాల్లో వైసిపి తరపున నమోదు కేంద్రాలు ఏర్పాటు చేశామని అన్నారు. ఈ అవకాశాన్ని పట్టభద్రులు వినియోగించుకోవాలని కోరారు. ప్రతిఒక్కరూ ఓటును నమోదు చేయించుకుని ఆ హక్కును వినియోగించుకోవడం మనందరి బాధ్యతని అన్నారు. నియోజకవర్గ పరిధిలోని పట్టభద్రులు తమ ఓటు నమోదుకు అవసరమైన పత్రాలు నమోదు కేంద్రం వద్దకు తీసుకువస్తే వెంటనే ఓటు నమోదు చేస్తామని చెప్పారు. గ్రాడ్యుయేషన్ డిగ్రీ ధ్రువపత్రం, ఆధార్, ఓటర్ ఐడి కార్డు జిరాక్సులు, పాస్ పోర్టు సైజ్ ఫొటోతో నమోదు కేంద్రాల వద్దకు వచ్చి ఓటును నమోదు చేసుకుని వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వినియోగించుకోవాలని కోరారు.



ఆమదాలవలస : ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రం



సర్వే రాళ్లను పరిశీలిస్తున్న తహశీల్దార్ రమణారావు

సర్వే రాళ్లు పరిశీలన

బూర్జ : మండలంలో ఇటీవల భూముల రీ సర్వే నిర్వహించిన రైతులకు త్వరలో సర్వే రాళ్లను పంపిణీ చేస్తామని తహశీల్దార్ రమణారావు తెలిపారు. మండలంలోని ఎబిసి పేటకు చేరిన సర్వే రాళ్లను శనివారం పరిశీలించారు. క్యాటగిరి-1లో ఎ.బి.సి.పేట, మహాజనవారిపేట, సుంకరాడ, వి.రాజన్న పేట, టి.ఆర్.రాజుపేట గ్రామాల్లో ఇటీవల భూ రీసర్వే నిర్వహించామని పేర్కొన్నారు. ప్రస్తుతం 2,501 రాళ్లు వచ్చాయన్నారు. ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి రైతువారీగా రాళ్లు లెక్కకట్టి భూములపైకి రాళ్లు ఎన్ఆర్ఇజిఎస్ కూలీలతో తరలించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

సృజనాత్మకతను వెలికితీసేందుకే..

టెక్కలి : తరగతి గదుల్లో విద్యార్థులు పుస్తకాల్లో ఉన్న విజ్ఞానంతో పాటు సామాజిక పరిస్థితులను అంచనా వేసేవిధంగా తయారు చేయాలనే ఉద్దేశంతో ఆర్‌బిఎస్ వంటి కార్యక్రమాలు నిర్వహించామని రవీంద్రభారతి పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజ అన్నారు. పాఠశాల ఆవరణలో కోవిడ్ శనివారం ముందు, తర్వాత ఆనే ఆంశాలపై ఆంగ్లంలో మాట్లాడారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఆంగ్లంపై మక్కువ పెరుగుతుందన్నారు. ఆనంతరం విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ పద్మజ ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆహ్లాదంగా వన మహోత్సవం

కవిటి : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మండలంలో వన మహోత్సవాలు సందడిగా నిర్వహించారు. గ్రామ గ్రామాన పిల్లలు, పెద్దలు, యువకులు, వృద్ధులు అనే తేడా లేకుండా వనమహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ, అందరూ ఏకమై తమ మధుర స్మృతులను నెమరువేసుకుంటున్నారు. దీంతో పల్లెలో ఆధ్యాత్మిక శోభ, ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది.



వనభోజనంలో పాల్గొన్న గ్రామస్తులు